www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 13 ఏప్రిల్ 2025

5

వైఎస్ఆర్

వైభవంగా

కోదండరాముడి రథోత్సవం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శనివారం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10.30 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది. శ్రీ సీతాలక్ష్మణ సమేత కోదండరాములవారు రథాన్ని అధిష్టించి గ్రామవీధుల్లో విహరించారు. భజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలు చేస్తుండగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు అందించారు. కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ సిహెచ్.వెంకయ్య చౌదరి, జెఇఒ వి.వీరబ్రహ్మం, డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఇంజినీరింగ్ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు చక్రస్నానం : శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు సోమవారం ఉదయం 9 నుండి 10.30 గంటల వరకు చక్రస్నానం వైభవంగా జరుగనుంది. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

15న పుష్పయాగం : శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో 10వ రోజు మంగళవారం సాయంత్రం 6 నుండి రాత్రి 9.00 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు.

దడ పుట్టిస్తున్న విద్యుత్ బిల్లులు

- ఎఫ్‌పిపిసిఎ మాటున ఛార్జీలు పెంపు
- జనం బెంబేలు
- 5 నెలల నుంచి ఇదే తంతు
- దిక్కుతోచని స్థితిలో వినియోగదారులు

CALL 1912
CUSTOMER CARE 24/7
APSPDCL
Demand / Disconnection notice
CIRCLE KADAPA
NAME BANDI MYSURA REDDY
USC NO 2511101021327
BILL PERIOD 03.04.25 04.03.25
PRESENT PREVIOUS
KWH 21733 21621
BILLED UNITS 112.0
MIN/ENERGY CHRGS 358.50
FIXED CHARGES 30.00
CUSTOMER CHARGES 45.00
ELECTRICITY DUTY 6.72
FPPCA(Y22 7.9) 413.15
FPPCA(2023 06) 35.16
FPPCA(2025 03) 35.60
TrueUp Charges(33/36) 39.34
Loss/Gain (+ / -) -0.47
BILL AMT Rs.963.00
TOTAL DUE Rs.963.00
DUE DATE 18-Apr-2025
DISCONNECTION DATE 05-May-2025
LAST PAID :675 on 05-03-2025
SD Available 600.00
Asking Bribe ? - Call 1064 or send a mail to Complaints acb @ ap.gov.in

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విద్యుత్ ఛార్జీల భారం మోయలేక జనం అల్లాడిపోతున్నారు. ఐదు నెలల నుంచి ఎఫ్‌టిపిసిఎ ఛార్జీలతో జనం బెంబేలెత్తుతున్నారు. ఛార్జీలు పెంచితే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని ఎఫ్‌పిపిసిఎ పేరుతో వాడుకున్న విద్యుత్ కంటే 62 శాతం పైగా బాదుడు వేస్తున్నారు. ఛార్జీల పెరుగుదలతో వినియోగదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గత ప్రభుత్వం తప్పిదమంటూ కూటమి ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. మరో వైపు ఈ భారమంతా కూటమి ప్రభుత్వానిదేనంటూ వైసిపి తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. ఒకరిపె నొకరు ఆరోపణలు చేసుకుంటూ వినియోగదారుల నెత్తిన విద్యుత్ భారం మోపారు. వాడుకున్న విద్యుత్‌కు వస్తున్న కరెంటు బిల్లులకు ఏమాత్రమూ సంబంధం లేకుండా ఉండడంతో జనాలు లబోదిబోమంటున్న పరిస్థితి ఏర్పడింది. రూ.963 కరెంటు బిల్లులో ఫిక్స్ ఛార్జీలు రూ .30, కస్టమర్ ఛార్జీలు రూ .45, ఎఫ్‌పిపిసిఎ రూ .413 (వై 22. 7.9), ఎఫ్‌పిపిసి ఎ. రూ . 35 (2023, 06), ఎఫ్‌పిపిసి ఎ. రూ . 35 (2025. 03), ట్రూ ఆప్ ఛార్జీలు రూ. 39 ఇలా అదనపు ఛార్జీల భారం రూ.605 ఉన్న పరిస్థితి నెలకొంది. 112 యూనిట్లకు బిల్లు రూ. 358 బిల్లు వస్తే అదనపు ఛార్జీలు రూ .605 జనం నెత్తిన రుద్దిన దుస్థితి కొనసాగుతోంది. జిల్లాలో 12 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో మూడొంతుల విద్యుత్ కనెక్షన్లు సామాన్య ప్రజానీకానికి సంబంధించినవే. గత ఏడాది నవంబర్ నుంచి అదనపు కరెంటు బిల్లులతోనే జనం తీవ్ర ఆందోళన చెందగా ఏప్రిల్‌లో బిల్లులు మరింత షాక్ కొడుతున్న పరిస్థితి నెలకొంది. డిసెంబర్ నెలలో ఎఫ్ పిపిసిఎ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చస్ కాస్ట్ అడ్జస్టెమెంట్) ఛార్జీలు రెండు ఉండగా, జనవరి, ఫిబ్రవరి నెలలో భారాలు మరింత పెంచారు. దీంతో బిల్లులు మోత మోగుతున్న పరిస్థితి నెలకొంది. 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి విద్యుత్ పంపిణీలో అదనపు ఖర్చుల పేరుతో జనాలపై విద్యుత్ బిల్లుల బాదుడు తారాస్థాయికి చేరింది. విద్యుత్ బిల్లులో సగానికి పైగా అదనపు ఛార్జీల భారమే ఉంటుంది. గత వైసిపి పాలనలో ఏడుసార్లు అదనపు ఛార్జీల భారం వడ్డించగా, కూటమి ప్రభుత్వం వచ్చిన 10 నెలలో నవంబర్ నుంచి అదనపు ఛార్జీల భారం మోపింది. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ చెప్పుకుంటూ వచ్చింది. కానీ అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ వరుస విద్యుత్ ఛార్జీల వడ్డన సాగిస్తోంది. ప్రస్తుతం ఎండ పెరగడంతో విద్యుత్ వాడకం మరింత ఎక్కువ అవకాశం ఉంది. వచ్చే నెలలో కరెంట్ అదనపు ఛార్జీలతో ఎంత కరెంట్ బిల్లు వస్తుందో అర్థం కాని పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారు.

ఎఫ్‌పిపిసిఎ, ట్రూఅప్ సర్దుబాట్లు

ఎఫ్‌పిపిసిఎ, ట్రూఅప్ విద్యుత్ ఛార్జీల బిల్లు కన్నా 62 శాతం పైగా వేస్తున్నారు. ఈ అదనపు ఛార్జీల పేరుతో ప్రభుత్వం జనాలను పీల్చిపిప్పి చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంక్షేమ పథకాల పేరుతో ఇచ్చినట్లే ఇచ్చి ఇతర రూపాల్లో గుంజుకుంటున్నారన్న చర్చ జరుగుతున్నాయి. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఇక నుంచి అదనపు ఛార్జీల భారాన్ని ఏ నెలకు ఆ నెలలో వసూలు చేయాలన్న ఆలోచన సైతం విద్యుత్ శాఖ, ప్రభుత్వం చేస్తున్నట్లు తెలుస్తోంది.

స్మార్ట్ మీటర్లతో అధిక బిల్లు

దుకాణాలకు స్మాట్ మీటర్లు బిగించడం వల్ల అధికం బిల్లు వస్తుందని దుకాణ యజమానులు అంటున్నారు. పాత మీటర్లు ఉన్నప్పుడు బిల్లు తక్కువ వచ్చేదని స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత అధిక స్పీడ్ పెరిగి అధిక యూనిట్లు రావడంతో బిల్లు కూడా ఎక్కువగా వస్తుంది. దీనికి తోడు అదనపు ఛార్జీలు మరింత భారంగా మారాయి.

- దస్తగిరి, వ్యాపారి, పులివెందుల

వాడకం కన్నా బిల్లు ఎక్కువ

విద్యుత్ వాడకం తక్కువైనా కూడా కరెంటు బిల్లు మాత్రం అధికంగా వస్తుంది. మీటర్ తిరిగితే వచ్చే బిల్లు కన్నా అదనంగా 62 శాతం అంత కంటే ఎక్కువ ఛార్జీలు వేయడం వల్ల బిల్లు రెట్టింపు అవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి పేదలకు బిల్లు భారాన్ని తగ్గించాలి

- సుజాత, గృహిణి , పులివెందుల

అదనపు మోతే అధికం

కూలి పనికి పోయి ఇంటి అద్దె కట్టలేని పరిస్థితి. దీనికి తోడు అదనపు ఛార్జీలు భారంగా మారుతున్నాయి. ఎక్కువ బిల్లు వచ్చే వారిపై అదనపు ఛార్జీలు విధిస్తే బాగుంటుంది. కానీ తక్కువ బిల్లు వచ్చే వారిపైనా విధించడం వల్ల పేదవాళ్లకు మరింత భారం పడే అవకాశం ఉంది. ప్రభుత్వం 200 యూనిట్ల వరకు పేదలకు ఉచితంగా విద్యుత్ ఇస్తామని చెప్పి ఇప్పుడు అదనపు ఛార్జీల భారం మోపడం ప్రజలను మోసం చేసినట్టే.

- సావిత్రి, వ్యవసాయ కూలీ, పులివెందుల

ముగిసిన సిఎం చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి-కడప అర్బన్

రెండు రోజుల జిల్లా పర్యటన ముగించుకుని కడప విమానాశ్రయం నుండి తిరుగు పయనమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జిల్లా అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు సాదర వీడ్కోలు పలికారు. శుక్రవారం రాత్రి ఒంటిమిట్ట శ్రీసీతాసమేత కోదండరామస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి శనివారం ఉదయం 11 గంటలకు కడప విమానాశ్రయం నుండి విజయవాడకు తిరుగు పయనమైన ఆయనకు జిల్లా నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సాదర వీడ్కోలు పలికారు. కడప విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు పలికిన వారిలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, టిటిడి ఇఒ శ్యాములరావు, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్‌పి ఇ.జి.అశోక్ కుమార్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్‌ఒ ఎం.విశ్వేశ్వర నాయుడు, జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ ఉన్నారు. వారితో పాటు అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్, కడప, మైదుకూరు, కమలాపురం ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుట్టా సుధాకర్ యాదవ్, పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, టిడిపి పోలిట్ బ్యూరో మెంబర్ ఆర్.శ్రీనివాసులరెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, లక్ష్మీరెడ్డి ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

విక్టరీ సింబల్ చూపుతున్న సాయిరాం కళాశాల విద్యార్థినులు

జాతీయ లోక్ అదాలత్‌ను

సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప : జాతీయ న్యాయసేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కడప జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మే10 న జిల్లా వ్యాప్తంగా నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకొని సత్వరం న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి, ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. పూర్తి సమాచారం కోసం 08562 -258622, 244622లలో సంప్రందించాలన్నారు.

నేడు సీనియర్స్ జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు

ప్రజాశక్తి - కడప : ఈనెల 13న ఉదయం 7:30 గంటలకు కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో సీనియర్స్, అండర్-23 పురుషుల జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగి ఎంపికలకు హాజరయ్యే క్రికెట్ క్రీడాకారులు తమతోపాటు ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువీకరణ పత్రం (ఫారం- 5) ఒరిజినల్‌తో పాటు జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. ఎవరికి కావాల్సిన క్రికెట్ కిట్ వారే తెచ్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అండర్ -23 ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2002 సెప్టెంబర్ నెల ఒకటవ తేదీ తరువాత జన్మించి ఉండాలి అని తెలిపారు.

అలజడి!

ప్రజాదృష్టి

పులివెందుల డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) పరిధిలో చేసిన అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించడం అలజడి రేపుతోంది. ఏడాది వ్యవధిలో ఆడిట్, విజిలెన్స్ విచారణల పేరుతో వరు సగా శూలశోధన చేయడం వెనుక మర్మమేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు ఐదేళ్లలో చేపట్టిన 6,300 అభివృద్ధి పనులపై ఆర్నెళ్ల కిందట నుంచి పాడాలో చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి వ్యయాలపై ఆడిట్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులో ఎటువంటి అవకతవకలు చోటు చేసుకున్నాయో తెలియలేదు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి పనులకు రూ.38 కోట్లు విడుదల చేసింది. స్థానిక అధికార టిడిపి నేతలు జీర్ణించుకోలేకపోవడం, వరుసగా ఫిర్యాదులు చేసిన అనంతరం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. పులివెందుల నియోజకవర్గ పరిధిలో గత వైసిపి సర్కారు హయాంలో చేపట్టిన సుమారు 6,300 అభివృద్ధి పనులపై ఆడిట్‌లో ఎటువంటి అవకతవకలు చోటుచేసుకున్నాయో తెలియ లేదు. ఇంతలో మరో సారి విజిలెన్స్ విచారణ ఆదేశించడం వెనుక మత లబేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. ఆయా ప్రభుత్వ విభాగాల వారీగా పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. పిఆర్, ఆర్ అండ్‌బి, ఎపి ట్రాన్స్‌కో, స్పోర్ట్స్, మున్సిపాలిటీ తదితర విభాగాల్లో పెద్ద సంఖ్యలో అభివృద్ధి పనులు చేపట్టింది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే జల్ జీవన్ పనులపై విచారణకు ఆదేశించింది. విచారణ అనంతరం వెనక్కి తగ్గ డం తెలిసిందే. అభివృద్ధి పనుల్లో వాస్తవంగా అవకతవకలు జరిగి ఉంటే విచారించడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడం సబబే. కానీ ఉద్దేశ పూర్వకంగా రాజకీయంగా ప్రత్యర్థి పార్టీని దెబ్బతీయాలనే ఉద్దేశంతో విచారణల పేరుతో కాలయాపన చేయడం ఆందోళనకరమని గ్రహించాలి. గత వైసిపి సర్కారు హయాంలో వేల సంఖ్యలోని నీరు-చెట్టు పనులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. చిన్నపాటి తప్పిదాల పేరుతో కొంతమంది ఇంజినీరింగ్ అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే పాడా, జల్‌జీవన్ తదితర అభివృద్ధి పనులపై ఆడిట్, విజిలెన్స్ వంటి ఏజెన్సీలను ఉసిగొల్పడం ఆందోళన కలిగిస్తోంది. పులివెందుల నియోజకవర్గంలో పాడా ఏజెన్సీ కింద చేపట్టిన వేల సంఖ్యలోని అభివృద్ధి పనులపై విచారణకు ఆదేశించిన నేపథ్యం ప్రభుత్వ వైఖరి సందేహాలకు తావిస్తోంది. గత నీరు-చెట్టు అభివృద్ధి పనుల్లో చోటుచేసుకున్న చిన్నపాటి కంపతొలగింపు వంటి తప్పిదాలపై ఇంజినీరింగ్ అధికారులపై కేసులు నమోదు చేయడం సరికాదనే వాదన వినిపిస్తోంది. బ్యూరోక్రసీ సైతం నిజాయతీగా విధులు నిర్వహించాల్సిన అవసరం ఉరుముతోంది. లేనిపక్షంలో పాలక వర్గాలకు సహకరిస్తే బ్యూరోక్రసీ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే సంగతిని గమనంలో ఉంచుకుని ప్రవర్తించాల్సి ఉంది. లేనిపక్షంలో ఇటువంటి ప్రతీకారాత్మక ధోరణి తరహాలో విచారణ చేయకుండా అర్థవంతమైన అక్రమాలపై దృష్టి సారిస్తేనే ఎంతో ప్రయోజనం ఉంటుందనే సంగతిని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

శ్రీచరణి ఎంపిక జిల్లాకే గర్వకారణం

- మహిళా క్రికెట్‌ను ఎసిఎ ఎంతగానో ప్రోత్సహిస్తుంది
- జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.భరత్‌రెడ్డి, కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్

శ్రీచరణిని అభినందిస్తున్న ఎసిఎ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి - కడప

జిల్లాకు చెందిన ఎన్. శ్రీ చరణి భారత సీనియర్ ఉమెన్ క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.భరత్ రెడ్డి, కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి శ్రీలంకలోని కొలంబియాలో ప్రారంభమయ్యే ట్రై నేషన్స్ వన్డే సిరీస్ లో పాల్గొనే భారత సీనియర్ మహిళ క్రికెట్ జట్టుకు ఎంపికైన ఎన్. శ్రీ చరణికి శనివారం మధ్యాహ్నం కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సన్మాన సభ నిర్వహించారు. ఆమెను జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. శ్రీచరణి తండ్రి చంద్రశేఖర్‌రెడ్డిని కూడా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, అలాగే జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఎంతగానో ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని కడప జిల్లా మహిళా క్రికెటర్లు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. భారత మహిళా క్రికెట్ జట్టుకు ఆడే అవకాశం శ్రీచరణికి రావడం తన అదృష్టంగా భావించి మరింతగా ఎదగాలని అన్నారు. శ్రీ చరణి మాట్లాడుతూ తాను భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపిక అవ్వడం గర్వంగా, సంతోషంగా ఉందని అన్నారు. తను ఇంతటి స్థాయికి చేరుకునేందుకు జిల్లా సీనియర్ క్రికెటర్లు ఎం. సురేష్, కాజా మైనుద్దీన్, తన తండ్రి చంద్రశేఖర్ రెడ్డి మేనమామ కిషోర్ కుమార్‌రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కృషి, ప్రోత్సాహం ఎంతగానో ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి. నాగేష్ కుమార్ రాజు, సంయుక్త కార్యదర్శి యం. సాయి పృథ్వీతేజ, కోశాధికారి ఎం. మహేంద్ర రెడ్డి, మెన్ రిప్రజెంటేటివ్ షేక్ సిరాజుద్దీన్ దౌలా, ఎన్ మౌనిక, సభ్యులు పి. సంజయ్ కుమార్ రెడ్డి, వై. విష్ణు ప్రీతం రెడ్డి, ఎల్. ముని కుమార్ రెడ్డి, ఎస్. కాజా మైనుద్దీన్, ఎం. శ్రీకాంత్ రెడ్డి, వై. శివప్రసాద్, ఎం. సురేష్, పి. విజయ్ కుమార్, కె. విష్ణు మోహన్ రావు, అకాడమీ స్టాఫ్ కోచ్‌లు పాల్గొన్నారు.

మహాసభల కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - బద్వేలు : స్థానిక సుందరయ్య భవనంలో శనివారం ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 20,21 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా, కొండపల్లిలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ పట్టణ కన్వీనర్ కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్షలాదిమంది నేటికీ రజక వృత్తియే జీవనాధారంగా జీవిస్తున్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 78 వసంతాలు పూర్తయినా నేటికీ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రజకులు తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికీ గ్రామాలలో రజకులపై పెత్తందారీతనం, కులవివక్ష కొనసాగుతుందని, శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని ప్రశ్నిస్తే నేరంగా భావించి గ్రామ సాంఘిక బహిష్కరణలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం పట్టణ అధ్యక్షులు చెప్పలి సుబ్బరాయుడు, పట్టణ నాయకులు ప్రభలవీడు శ్రీనివాసులు, దిరసంత కేశవ, ఏటూరి బాలయ్య, చేతి వృత్తిదారుల సంఘం పట్టణ నాయకులు గంగన పల్లె నాగార్జున, కుంభగిరి రామయ్య, దళాయి రత్నమయ్య,మూరా ప్రసాద్, మోక్షమ్మ, కైరోన్ బీ,ఫాతిమా పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి విజేతగా పి.మేఘన

ప్రజాశక్తి - కడప : ఒలంపియాడ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ హ్యాండ్ రైటింగ్ పరీక్షలో కడప నగరం ప్రకాష్ నగర్ తేజ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి పి. మేఘన సి-విభాగంలో రాష్ట్రస్థాయి విజేతగా నిలిచిందని ప్రధానోపాధ్యాయురాలు పెద్దకోట్ల నిర్మలాదేవి తెలిపారు. శనివారం తేజ స్కూల్‌లో విజేతలందరికీ బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. విద్యార్థులందరూ చక్కని చేతి రాత అలవాటు చేసుకోవాలని, తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలియజేశారు. విద్యార్థులకు శిక్షణ నుంచి ఈ విజయానికి కారణమైన చేతి రాత నిపుణులైన పవన్ కుమార్‌ను ప్రత్యేకంగా స్కూల్ యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో తేజ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ పెద్దకోట్ల వెంకటేశ్వర్ ప్రసాద్, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రథమ సంవత్సరంలో అందరూ ఫెయిల్

ప్రజాశక్తి - కమలాపురం : కమలాపురంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 33 మంది విద్యార్థినులు పరీక్షలు రాశారు. శనివారం విడుదల చేసిన ఇంటర్ పరీక్షా ఫలితాలలో ఫెయిల్ అయ్యారని హెడ్ మాస్టర్ ఖాజా పర్వీన్ తెలిపారు. ఈ కళాశాలలో ఎపిసి, బైసిపి ఇంగ్లీషు మీడియం కోర్సులున్నాయి. ద్వితీయ సంవత్సరంలో 14 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా అందులో ఇద్దరు మాత్రమే ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు. కళాశాలలో విద్య చెప్పడానికి సరైన అధ్యాపకులు లేకుంటే పిల్లలు ఎలా ఉత్తీర్ణత సాధిస్తారు అని ప్రజలు గుసగు సలాడుతున్నారు.

మాట్లాడుతున్న మేజర్ శ్రీనివాస్

విద్యార్థులు వివేకంతో మెలగాలి

ప్రజాశక్తి - బద్వేలు

విద్యార్థులు ఎప్పుడూ చదువు కున్న అజ్ఞానిగా ఉండ కూడదని వివేకం తో మెల గాలని మేజర్ ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ మేజర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం శ్రీ రాచ పూడి నాగభూషణం కళాశాల 28వ వార్షికోత్సవ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విలువలతో కూడిన విద్యనభ్యసించాలంటే మంచి గురువుల అవసరం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరికి ఒక రోజు తప్పకుండా ఉంటుందని దానికోసం కష్టపడుతూ ఎదురు చూడాలని ఆయన తెలిపారు. కింద పడిన ప్రతిసారి ఎక్కువ ఉత్సాహంతో ముందుకు సాగాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థీ మెదడుకు పదును పెట్టాలని అప్పుడే అద్భుతాలు జరుగుతాయని ప్రముఖ అతిథిగా విచ్చేసిన 2023 యుపిఎస్‌సి ఆల్ ఇండియా 783వ ర్యాంక్ ఐఆర్ఎంఎస్. ఎం ఉదయ్ కృష్ణారెడ్డి అన్నారు. చదువుతోపాటు డిటర్మినేషన్, క్రమశిక్షణ తప్పక అవసరమని ఆయన అన్నారు. ప్రపంచంలో గొప్ప వాళ్ళ విజయ గాధలు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతాయని ఆయన అన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పబ్లిక్ హెల్త్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు అస్కార రావు డిమాండ్ చేశారు. శనివారం నబికోటలోని కింగ్ ప్యాలెస్‌లో యూనియన్ సర్వసభ సమావేశం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ సచివాలయంలో పనిచేస్తున్న వైద్య సిబ్బందిని ఆరోగ్య శాఖకు మార్చాలని పేర్కొన్నారు. యాప్ పని భారం తగ్గించాలని చెప్పారు. కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ల సర్వీసును రెగ్యులర్ చేయాలని కోరారు. ల్యాబ్ టెక్నీషియన్ల ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న వారి జీవితపత్యాలు సవరించి 23 శాతం ప్రకారం రెమ్యూనరేషన్ ఇవ్వాలని పేర్కొన్నారు. పలు సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శి ఆహారోన్, కోశాధికారి బాబాసాహెబ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎండి మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఇంటర్‌లో అమ్మాయిలదే హవా

- మొదటి సంవత్సరంలో 21, ద్వితీయ సంవత్సరంలో 22వ ర్యాంక్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అమ్మాయిల హవా కొనసాగింది. మొదటి సంవత్సరం అబ్బాయిలు 6994 మంది పరీక్షలకు హాజరు కాగా 3,795 మంది ఉత్తీర్ణత సాధించారు. 54 శాతం ఫలితాలు నమోదు చేశారు. అమ్మాయిలు 8,307 పరీక్షలు హాజరు కాగా 5,500 మంది ఉత్తీర్ణత సాధించారు. 66 శాతం ఫలితాలు నమోదు చేశారు. ద్వితీయ సంవత్సరంలో 5,72 మంది పరీక్షలకు హాజరు కాగా 4,005 మంది ఉత్తీర్ణత సాధించారు. 70 శాతం ఫలితాలు నమోదు చేశారు. అమ్మాయిలు 7,126 మంది పరీక్షలకు హాజరు కాగా 5,683 మంది ఉత్తీర్ణత సాధించారు. 80 శాతం ఫలితాలు నమోదు చేశారు. మొదటి సంవత్సరం 15,301 మంది పరీక్షలకు హాజరు కాగా 9295 మంది ఉత్తీర్ణత సాధించారు. 61 శాతం ఫలితాలు నమోదు చేశారు. ద్వితీయ సంవత్సరంలో 12,878 మంది పరీక్షలకు హాజరుకాగా 9,688 మంది ఉత్తీర్ణులయ్యారు. 75 శాతం ఫలితాలు నమోదు చేశారు. ఒకేషనల్ ఫలితాల్లో మొదటి సంవత్సరం అబ్బాయిలు 493 మంది పరీక్షలు హాజరు కాగా 249 మంది ఉత్తీర్ణులయ్యారు. 51 శాతం ఫలితాలు నమోదు చేశారు. ద్వితీయ సంవత్సరంలో 377 మంది హాజరుకాగా 260 మంది ఉత్తీర్ణత సాధించారు. 69 శాతం ఫలితాలు నమోదు చేశారు. అమ్మాయిలు మొదటి సంవత్సరం 680 మంది పరీక్షలకు హాజరుకాగా 503 మంది ఉత్తీర్ణులయ్యారు. 74శాతం ఫలితాలు నమోదు చేశారు. ద్వితీయ సంవత్సరంలో 553 మంది పరీక్షలకు హాజరు కాగా 457 మంది ఉత్తీర్ణత సాధించారు, 23 శాతం ఫలితాలు నమోదు చేశారు. మొదటి సంవత్సరం 1173 మంది పరీక్షలు హాజరు కాగా 752 మంది ఉత్తీర్ణత సాధించారు. 64 శాతం ఫలితాలు నమోదు చేశారు. ద్వితీయ సంవత్సరం 930 మంది హాజరుకాగా 717 మంది ఉత్తీర్ణులయ్యారు. 77 శాతం ఫలితాలు నమోదు చేశారు. గత ఏడాది మొదటి సంవత్సరం 55 శాతం, ద్వితీయ సంవత్సరం 69 శాతం ఫలితాలు నమోదయ్యాయి. రాష్ట్రస్థాయిలో 24వ ర్యాంకు సాధించారు. ఈ ఏడాది మొదటి సంవత్సరం 21, ద్వితీయ సంవత్సరం 22 ర్యాంకు సాధించారు. అందరి కృషితో ఉత్తమ ఫలితాలు సాధించామని ఆర్ఐఒ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

నేడు పోరుబాట సదస్సు : యుటిఎఫ్

ప్రజాశక్తి-చెన్నూరు : మిగిలి ఉన్న ఆర్థిక బకాయిలు 11వ పిఆర్‌సి బకాయిలు, 2022 నుంచి ఇఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర బకాయిలు చెల్లించాలని, 12వ పిఆర్‌సి కమిటీ నియమించాలని ఐఆర్ 29 శాతం ప్రకటించాలనే డిమాండ్ల సాధన కోసం ఈనెల ఈనెల 13న ఉదయం 10 గంటలకు కర్నూలు యుటిఎఫ్ భవనంలో పోరుబాట సదస్సు నిర్వహించనున్నామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి లక్ష్మీరాజా చెన్నూరు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగిరెడ్డి వీరనారాయణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం ప్రాథమిక విద్యను నీర్వీర్యం చేసేందుకు తీసుకొచ్చిన జీవో 117 ను రద్దుచేయాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, సగం పంచాయతీలో కూడా మాడల్ ప్రైమరీ పాఠశాలకు ఏర్పాటు చేయకపోవడం తగదన్నారు. గ్రామాలలో ఊరిబడి ఒకటి నుండి ఐదు తరగతులు అలాగే కొనసాగించలన్నారు. కర్నూలులో జరిగే పోరుబాట సదస్సుకు జిల్లాలోని ఉపాధ్యాయులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బోగస్ పట్టాలు, భూకబ్జాలపై ఉద్యమం

15న కార్యాచరణ - సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరం 15వ డివిజన్ సరోజినీనగర్ దగ్గర ఉన్న ఆచార్య కాలనీలో మౌలిక సమస్యలు, బోగస్ పట్టాలపై సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి ఉద్యమ కార్యచరణ చేపడుతున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్ తెలిపారు. శనివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ డివిజన్‌లో ఉన్న ఆచారి కాలనీ 30 సంవత్సరాల కిందట ఏర్పడిందని తెలిపారు. ఇప్పటికి అక్కడ మౌలిక వసతులు, రోడ్లు, డ్రెయినేజీ, మంచినీటి సమస్య పరిష్కరించడంలో పాలకులు, అధికార యంత్రాంగం విఫలమయ్యారని విమర్శించారు. ఇంటి పట్టాలు, ఇళ్ల స్థలాలు దళారుల చేతిలో ఉన్నాయని, భూకబ్జాదారులు యథేచ్ఛగా అమ్ముకుంటున్నారని, తక్షణమే తహశీల్దార్ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బడుగు బలహీన వర్గాలకు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న వారికి, క్రిస్టియన్ మైనార్టీలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, కొంత మంది వ్యక్తుల దగ్గర పట్టాలు ఉన్నాయన్నారు.చెప్పారు. ఇప్పుడు వాటిని కొంతమంది బినామీ పేర్లతో దొంగ పట్టాలు సృష్టించి అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. దీనిపై మండల తహసిల్దార్, రెవిన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి భూ కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఊరి బడిని కాపాడుకుందాం

ప్రజాశక్తి - చాపాడు

'ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం' కరపత్రాలను యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్ మైదుకూరు మండలం వనిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ విద్యార్థులను ఊరి బడిలో చేర్పించి, ఊరి బడిని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్య పేద, బడుగు, బలహీన వర్గాలకు ముఖ్యంగా బాలికలకు అందని ద్రాక్షగా తయారవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి విలీన ప్రక్రియను ఎక్కడెక్కడ అడ్డుకోవాలని, ఊరి బడిలో విద్యార్థులను చేర్పించి ఊరి బడిని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేకల గురయ్య, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్, ఎం.గురివిరెడ్డి, మొహిద్దీన్ ఖాన్, పిన్నా సుధాకర్ బాబు, శ్యామలదేవి, మున్నీర్, నరసింహమూర్తి, రామ్ నాయక్, సంజమ్మ, ఎస్ఎం బాషా, సుధాకర్, సురేశ్, వరప్రసాదం, జబ్బార్, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

పార్టీ అండగా ఉంటుంది : సతీష్‌రెడ్డి

ప్రజాశక్తి - చక్రాయపేట

సురభి గ్రామం నాగలగట్టుపల్లె వైసిపి మండల ఉపాధ్యక్షుడు రాంబాబును శనివారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి సతీష్ కుమార్‌రెడ్డి పరామర్శించారు. రాంబాబుపై దాడి చేసిన విషయం తెలుసుకుని వెళ్లారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడాతూ అధైర్యపడవద్దని సూచించారు. దాడి జరిగిన తీరు, చేసిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కోడిగాండ్లపల్లెలో ఘనంగా గుడి ప్రతిష్టాపన

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని కోడిగాండ్లపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో శనివారం రాముని విగ్రహ ప్రతిష్టాపన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జమ్మలమడుగు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, కార్యకర్తలు, గ్రామస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని తవ్వారుపల్లె, ఆంజనేయ కొట్టాలు గ్రామల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేకపూజలు జరిగాయి. హనుమజ్జయంతి సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణం పఠించారు. రాత్రి స్వామివారికి భజనలు నిర్వహించారు. తవ్వారుపల్లెలో ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు సందుల నాగశివారెడ్డి, కమిటీ సభ్యులు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

నగదు అందజేస్తున్న దాత నిత్యానంద్

శాశ్వత అన్నదానానికి రూ.5 లక్షలు విరాళం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక గౌరీదేవి బలిజ సంఘం శాశ్వత అన్నదానానికి నామా నారమ్మ, నామా చిన్నయ్య కుమారుడు నామా నిత్యానంద్(ఎన్ఆర్) రూ.5 లక్షలు విరాళం అందజేసినట్లు ఆ సంఘం అధ్యక్షులు నంబూరు కులాయప్ప, కటిక చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం బలిజ సంఘం వీధిలో ఉన్న గౌరీదేవి ఆలయంలో నంబూరు కులాయప్ప, కటిక చంద్రశేఖర్‌కు దాత నిత్యానంద్ రూ.5,16,116 నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాత ఇచ్చిన విరాళంతో ప్రతి ఏడాది కార్తీక మాసం శ్రీగౌరీదేవి పండగ పూర్తయిన తర్వాత భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తామన్నారు. దాత నిత్యానంద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రసాద్‌రెడ్డి, సంఘ నాయకులు కొత్తూరు రెడ్డయ్య, యడాల రామచంద్ర, గాలి హరిప్రసాద్, ముత్యాల ఆంజనేయులు, కంభగిరి నాగేంద్రబాబు, నామా లక్ష్మీ నారాయణ, జ్ఞానేశ్వర్, ఆరుశ్రీ ప్రసాద్, నామా రవి, యడాల సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు తృప్తినిస్తాయి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సేవా కార్యక్రమాలు అత్యంత తృప్తినిస్తాయని మౌనిక రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ రవికుమార్ అన్నారు. స్థానిక టీబీ రోడ్‌లో శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి, దైవజ్ఞులు సాల్మాన్‌బాబు చలివేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం తృప్తినిస్తుందన్నారు. అనంతరం ప్రజలకు మంచినీటిని మజ్జిగను అందజేశారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ గౌస్‌పీర్ మృతి

ప్రజాశక్తి - కమలాపురం

కమలాపురం నగర పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ షేక్ (వంశాయ) గౌస్ పీర్(72) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. కొద్ది రోజులుగా శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ శనివారం మధ్యాహ్నం స్వర్గస్థులైనారని మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ముస్లిం మైనార్టీ కుటుంబంలో జన్మించి గ్రామ లోని అన్ని కులాలు మతాల అభిమానాన్ని చూరగొని తనదైన శైలిలో రాజకీ యంగా ఎదిగారు. కమలాపురం పంచాయతీగా ఉన్న సమ యంలో 1995 నుండి 2001 వరకు సర్పంచ్‌గా ఈయన సేవలం దించారు. గతంలో ఆయన సతీమణి సర్పంచ్, కుమారుడు ఎంపిటిసిగా, కోడలు జడ్‌పిటసిగా ఉన్నారు. గౌస్ పీర్ మృతిపట్ల ప్రజలు, నియోజకవర్గం ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు నాలుగు రోడ్ల కూడలిలో కారును వెనుకవైపు నుంచి ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి బలమైన గాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. మైదుకూరు తహశీల్దార్ రాజసింహ నరేంద్ర ఒంటిమిట్ట నుంచి సిఎం కార్యక్రమాన్ని ముగించుకొని ప్రొద్దుటూరు వెళుతుండగా.. చాపాడు సర్కిల్‌లో పల్సర్ టూ వీలర్ బైక్ వేగంగా ఆర్‌టిసి బస్సును క్రాస్ చేసి ముందుకు వెళుతున్న సందర్భంలో గేటు వద్ద ఆగి ఉన్న కారును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మాబువల్లి, అమిర్ బాషా గాయపడ్డారు. మాబువల్లి తలకు బలమైన గాయమైంది. అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో తహశీల్దార్ కారులో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. తహశీల్దార్ కారుకు వెనుక వైపు అద్దాలు పగిలాయి.

ఇంటర్‌లో విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

'బీరం'లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి - ఖాజీపేట

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి శుక్రవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో బీరం శ్రీధర్‌రెడ్డి కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు. ఇంటర్ పరీక్షలకు 174 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ ఫలితాల్లో ఎక్కువ మంది విద్యార్థులు 460కిపైగా మార్కులు సాధించి ప్రతిభను చాటుకున్నారు. ఎంపిసిలో తుషతా 465/470, లిఖితారెడ్డి 465, బైపిసిలో ఉస్మాన్ 436 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్ పర్సన్ సరస్వతమ్మ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు సాధించిన మార్కులు ఎంతో గర్వంగా ఉన్నాయన్నారు. కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ అధ్యాపకుల అంకితభావం, కళాశాల యాజమాన్యం కృషి, విద్యార్థుల పట్టుదల వల్ల తాము మంచి ఫలితాలు సాధించామన్నారు. డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్ మాట్లాడుతూ ఇంటర్ ఫలితాలే నాణ్యమైన విద్యకు నిదర్శనమని పేర్కొన్నారు. కళాశాల యజమాని, అధ్యాపకులు, ప్రిన్సిపల్ బషీర్, వైస్ ప్రిన్సిపల్ శ్రీకాంత్ విద్యార్థులను అభినందించారు.

చక్రాయపేట : ఇంటర్మీడియట్ ఫలితాల్లో తాము వందశాతం ఉత్తీర్ణత సాధించామని చక్రాయపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రంతుబాషా, గండి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సురేంద్రబాబు తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపిసిలో 470కి 447 మార్కులతో లీలావతి, బైపిసిలో 440కి 410 మార్కులతో గంగోత్రి, సిఇసిలో 500కు 373 మార్కులతో మహమ్మద్ రఫీ.. రెండవ సంవత్సరం ఎంపిసిలో 1000కి 938 మార్కులతో రెడ్డిశంకర్, బైపిసిలో 1000కి 910 మార్కులతో బాలచంద్ర, సిఇసిలో 1000కి 712 మార్కులు జస్వంత్ సాధించారు. ఉత్తమ ఫలితాలను సాధించారని ప్రిన్సిపల్ రంతుబాషా, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. గండి గురుకుల పాఠశాలలో మొదటి సంవత్సరంలో 67 మంది పరీక్ష రాయగా, 66మంది ఉత్తీర్ణత సాధించారు. రెండవ సంవత్సరంలో 52మంది రాయగా వందశాతం శాతం ఉత్తీర్ణులయ్యారు. రెండవ సంవత్సరంలో టాప్‌గా పి.హిమసాయి 943, జస్వంత్ 902, వినయ్‌కుమార్ 879.. మొదటి సంవత్సరంలో టాప్ రాజు 449, విజయ్ తనుజు 442, సంతోష్ నాయక్ 440 సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ సురేంద్రబాబు తెలిపారు. సెకండ్ ఇయర్ బైపిసి పరీక్షల్లో టి.పవన్‌కుమార్ 872, పి.మధు కిషోర్ 866, జి .యోగానంద తేజ 864, ఫస్ట్ ఇయర్ బైపిసి ఎం.గోవర్ధన్ 426, ఎస్.చక్రపాణి 419, జి.వంశీకృష్ణ 408 ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

ఎర్రగుంట్ల : ఉత్తమ మార్కులు సాధించామని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ త్రివిక్రమ్ రెడ్డి తెలిపారు. ఆ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ ఎంపిసిలో 1000 మార్కులకు 984 మార్కులు సాధించి ఎస్.శ్రీరామ్ అనే విద్యార్థి కాలేజీ టాప్‌లో నిలిచాడని తెలిపారు. ఎంపిసి ఫస్టియర్‌లో 470 మార్కులకు 443 మార్కులు గంగా అమృత అనే అమ్మాయి సాధించి టాప్‌లో నిలిచిందన్నారు. బైపిసిలో రెండవ సంవత్సరం 1000కి 930 మార్కులు వచ్చాయన్నారు. సిఇసిలో 1000కి 911 మార్కులు వచ్చాయన్నారు. ఫస్ట్ ఇయర్‌లో 150 మంది విద్యార్థులలో 60 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. సెకండ్ ఇయర్‌లో 160 మంది విద్యార్థులు ఉంటే 75 శాతం ఉత్తీర్ణత సాధించారని వివరించారు.

వేంపల్లె : ఇంటర్ ఫలితాల్లో అక్షర కళాశాల అగ్రస్థానంలో నిలిచిందని ఆ కళాశాల కరస్పాండెంట్ భూమిరెడ్డి విజయ భారతి తెలిపారు. శనివారం వేంపల్లెలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఫలితాల్లో అక్షర బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారని చెప్పారు. మొదటి సంవత్సరం ఎంపిసిలో 445 మార్కులతో వైష్ణవి, సుకన్య మండలం ఫస్ట్‌గా నిలిచినట్లు చెప్పారు. రెండవ సంవత్సరం ఎంపిసిలో 963 మార్కులతో ఎస్.పాతిమా, బైపిసి విభాగంలో 956 మార్కులతో వి.వైష్ణవి మండల స్థాయిలో మొదటి స్థానం సాధించారని చెప్పారు. మొదటి సంవత్సరంలో ఎస్.ముబీనా 433 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. 400కుపైగా మార్కులు 8మంది బాలికలు సాధించారని తెలిపారు. రెండవ సంవత్సరంలో కె.ముత్యాలమ్మ, ఎస్.అఫ్సీన్962 మార్కులతో మండల ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు.8మంది బాలికలు 900పైగా మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం స్వీట్లు పంపిణీ చేసి బాణాసంచా పేల్చారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ విజయభారతి అభినందించారు.

స్వీట్లు తినిపిస్తున్న కరస్పాండెంట్ విజయభారతి

రెడ్డి శ్వేత

గండి రోడ్డులో ఉన్న నారాయణ కళాశాల బైపిసిలో మండల ఫస్ట్ వచ్చినట్లు ఎన్ఆర్ ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ కొట్టె నారాయణరెడ్డి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో నారాయణ కళాశాలకు చెందిన రెడ్డి శ్వేత బైపిసిలో 429 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. 26 మంది విద్యార్థులు ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారన్నారు. కళాశాల ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే తమ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో వేంపల్లె ప్రభుత్వ ఉర్దూ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆర్‌జెడి, ఉర్దూ కళాశాల ప్రిన్సిపల్ రవి పేర్కొన్నారు. సెకండ్ ఇయర్ విద్యార్థులు 97 శాతం, ఫస్టియర్‌లో 87 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఎంపిసి గ్రూపులో సయ్యద్ ఇమాంబీ 957, బైపిసిలో షేక్ మోబినా 950 మార్కులు సాధించినట్లు చెప్పారు. సిఇసిలో షేక్ ఫమీహకు 921 మార్కులు రాగా హెచ్ఇసిలో షేక్ సమీరా 608 మార్కులు సాధించారన్నారు. ఫస్ట్ ఇయర్ ఇంటర్‌లో ఎంపిసిలో షేక్ నఫీసా417, బైపిసిలో షేక్ నూర్జహాన్ 425 మార్కులు సాధించారన్నారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, మంచి ఫలితాలు కోసం కృషి చేసిన అధ్యాపకులకు ప్రిన్సిపల్ రవి అభినందనలు తెలిపారు.

కె.యతీశ్వర్

చాపాడు(మైదుకూరు) : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో మైదుకూరు సాయినాథపురానికి చెందిన కడియంపాటి యతీశ్వర్ ఎంపిసి విభాగంలో 985/1000 మార్కులు సాధించారు. మైదుకూరు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. కడియం పాటి సురేంద్రనాథ్, సుజనిదేవి కుమారుడు యతీశ్వర్. ఆర్థికంగా వెనకబాటుతనాన్ని మేధా విద్యా సంస్థల చైర్మన్ చెన్నంశెట్టి నరసింహులు గుర్తించి విద్యార్థికి ఉచిత విద్యను అందించారు. యతీశ్వర్ చిన్నతనం నుంచే చదువులో చురుగ్గా ఉంటూ పదవ తరగతి (572/600), ఇంటర్ ఫస్టియర్(462/470) మార్కులు తెచ్చుకొని మట్టిలో మాణిక్యంగా నిలిచారు. భవిష్యత్తులో మంచి ఇంజినీర్ కావాలన్నదే తన లక్ష్యమని యతీశ్వర్ చెబుతున్నారు. నియోజకవర్గస్థాయిలో ప్రథమ ర్యాంకు రావడం పట్ల ప్రిన్సిపల్స్ శెట్టి శ్రీనివాసులు, ధరిమిశెట్టి ప్రతాప్, పుర ప్రజలు, బంధువులు యాతీశ్వర్‌కు అభినందనలు తెలిపారు.

తొండూరు : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో చక్కటి ప్రతిభను చాటారు. మొదటి సంవత్సరం చదువుతున్న 43 మంది విద్యార్థులలో 38 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రయివేట్ కళాశాలలకు ధీటుగా మంచి మార్కులు సాధించారు.

చాపాడు : ఇంటర్మీడియట్ ఫలితాలలో కస్తూరిబా విద్యార్థుల ప్రతిభ చూపినట్లు పాఠశాల ఎస్ఓ నాగలక్ష్మి తెలిపారు. ఎంపిసి మెదటి సంవత్సరంలో 32 మందికి గాను 27 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కె.శిరీష 436 మార్కులు సాధించి మెదటి స్థానంలో నిలిచారన్నారు. ద్వితీయ సంవత్సరంలో 21 మందికి గాను 19 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. డిపూజిత 878 మార్కులు సాధించి మెదటి స్థానంలో నిలిచారన్నారు.

వేముల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కేజీబీవీ జూనియర్ కాలేజీ ఇంటర్ విద్యార్థులు ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎంపిసి గ్రూపులో టి.ప్రణీత 446 మార్కులతో మండలంలో ప్రథమస్థానంలో, కె.రజీనా 445 మార్కులతో రెండవ స్థానంలో, కేజీబీవీ జూనియర్ కాలేజీలోని బైపీసీ గ్రూపులో ఎస్. మంజుశ్రీ 423 మార్కులతో మండలంలో మొదటి స్థానాన్ని సాధించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సర విద్యార్థులు 75 శాతం, సెకండ్ ఇయర్‌లో 95 శాతం, కేజీబీవీ జూనియర్ కాలేజ్ 95 శాతం, సెకండ్ ఇయర్‌లో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అధ్యాపక బృందానికి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ రామసుబ్బయ్య, కేజీబీవీ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ శారద విద్యార్థులను అభినందించారు.

పులివెందుల రూరల్ : శనివారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో పులివెందుల పట్టణంలో ఉన్న శ్రీ సాయి చైతన్య జూనియర్ కాలేజి విజయకేతనం ఎగుర వేసిందని ఆ విద్యా సంస్థల డైరెక్టర్, సహ వ్యవస్థాపకురాలు నీరజారెడ్డి పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం ఇంటర్ ఎంపీసీలో 462/470 మార్కులతో బి.అభిషేక్ రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచాడు. బైపిసిలో ఎం సాహితీ 429/440, సిఇఎలో 448/500 మార్కులతో ఏ దక్ష అక్షయ రెడ్డి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ నుండి 963/1000 మార్కులతో వి.హర్షిత, బైపిసి నుండి 981/1000 మార్కులతో ఎస్.హరీష్ కుమార్ రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచారు. సిఇసిలో ఎస్.ఫయాజ్ 864/1000 మార్కులు సాధించారు. ఇంటర్ ఫస్టియర్ నుండి 400 మార్కులుపైగా 30 మంది విద్యార్థులు, ఇంటర్ సెకండియర్ నుంచి 900 మార్కులుపైగా 18 మంది విద్యార్థులు సాధించారు. తమ విద్యార్థులకు అసాధారణమైన కోచింగ్ నిరంతరం అందిస్తున్న అధ్యాపక బృందానికి స్థాపకుడు చైర్మన్ ఏ.నారాయణరెడ్డి, డైరెక్టర్ పి.వెంకట సుబ్బారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎద్దుల గంగిరెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులను ప్రశంసించారు.

శ్రీ సాయి చైతన్య జూనియర్ కాలేజి విజయకేతనం

జమ్మలమడుగు రూరల్ : ఇంటర్మీడియట్ ఫలితాల్లో సాయి పరమేశ్వర జూనియర్ కళాశాల విజయ దుందుభి మోగించిందని ఆ కళాశాల కరస్పాండెంట్ పాలా నాగేశ్వరరెడ్డి తెలిపారు. విద్యార్థులు ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ అన్ని గ్రూపులలో అత్యుత్తమ మార్కులు సాధించి స్టేట్ ర్యాంకులతోపాటు టౌన్ స్థాయిలోనూ సత్తా చాటారన్నారు. మట్టిలో మాణిక్యాల్లాంటి తమ విద్యార్థుల ప్రతిభతో తమ కళాశాల జమ్మలమడుగును రాష్ట్రంలో 5వ, 7వ, 9వ స్థానంలో నిలిపిందన్నారు. విద్యార్థుల అంకితభావం, కృషి, అధ్యాపకుల నిరంతర ప్రోత్సాహం వల్లే ఈ అద్భుతమైన ఫలితాలు సాధ్యమయ్యాయని అన్నారు. విద్యార్థులను అభినందించారు. వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఘన విజయం సాయి పరమేశ్వర జూనియర్ కళాశాల ఉన్నత ప్రమాణాలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ఫలితాలు జమ్మలమడుగు ప్రాంతానికి గర్వకారణం. సాయి పరమేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థుల ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు.

విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్

లింగాల : మండల పరిధిలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బాలికలు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ సత్యవతమ్మ తెలిపారు. బైపీసీ విద్యార్థి భవన 925 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిందన్నారు. ఎంపిసి విభాగంలో 887 మార్కులతో చైతన్య ఉత్తీర్ణత సాధించారన్నారు.

వల్లూరు : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో పిఎం శ్రీ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.సురేష్ బాబు తెలిపారు. శనివారం విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో జూనియర్ ఇంటర్ విద్యార్థులు 74 శాతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 81 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఆర్. స్పందన ఎంపిసి 422, జి. లక్ష్మీదేవి బిపిసి 406, ఎం ముబీన సిఇసి 433 మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఎన్. దివ్య సాయి బైపిసి 940, కె.స్పందన ఎంపిసి 935, డి. శ్యామల సిఇసి 853 మార్కులు సాధించారు విద్యార్థులను ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు అభినందించారు.

కడప : ఇంటర్మీడియట్ ఫలితాల్లో కడప నగరంలోని శ్రీ వివేకానంద బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. కళాశాల స్థాపించిన మొదటి ఏడాదిలోనే జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన కళాశాలగా శ్రీ వివేకానంద బాలికల జూనియర్ కళాశాల నిలిచింది. ఉత్తమ ఫలితాలు సాధించడంతో కళాశాల వద్ద బాణాసంచా పేల్చి విజయోత్సవాలు జరుపుకున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ డిఎస్ఆర్. మనోహర్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎన్. పి. మధుసూదన రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ పి. దాదా కలందర్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

చెన్నూరు : మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన తిప్పలూరు వెంకటలక్ష్మి రమణ కుమార్తె తిప్పలూరు ప్రణీత ఇంటర్ మొదటి సంవత్సరంలో 454/ 470 మార్కులు సాధించి మంచి ప్రతిభ కనబరిచింది. విద్యార్థిని తిరుపతి నారాయణ కళాశాలలో ఇంటర్ చదువుతుంది. 10 క్లాస్‌లో 600/584 సాధించి మార్కులు సాధించిందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బంధువులు పేర్కొన్నారు.

విజయకేతనం చూపుతున్న గౌతమ్ కళాశాల విద్యార్థులు

బద్వేలు : ఇంటర్ పరీక్షలకు సంబంధించి శనివారం వెలువడిన ఫలితాలలో బద్వేల్ గౌతమ్ జూనియర్ కళాశాల విద్యార్థులు టౌన్ ఫస్ట్ మార్కులతో పాటు అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించారని కళాశాల కరస్పాండెంట్ పంగా సౌజన్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీనియర్ ఇంటర్‌లో సాయి బృంద - 987, కె.వి. సాయిరాం - 986, పి. పూర్ణ శ్రీ సాయి - 985 టౌన్ టాప్ మార్కులతో పాటుగా 27 మంది విద్యార్థులు 900 పైగా మార్కులు సాధించారని, జూనియర్ ఇంటర్‌లో రషీద్ 464 మార్కులతో టౌన్ ఫస్ట్, 463 మార్కులతో ప్రవల్లిక , ఆర్. చక్రధర్ టౌన్ సెకండ్ 462 మార్కులు సాధించారని, రిజ్వానా, ఆర్షియా టౌన్ థర్డ్, 461 మార్కులతో అభినయ్ టౌన్ ఫోర్త్, 460 మార్కుల తో బాలాజీ టౌన్ ఫిఫ్త్ మార్కులు సాధించడంతో పాటుగా 26 మంది విద్యార్థులు 400 పైగా మార్కులు సాధించారని చెప్పారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను అధ్యాపక బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవికుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన నారాయణ కాలేజీ విద్యార్థులు

కడప అర్బన్ : ఇంటర్మీడియట్ ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటాలని డిజిఎం రామ మోహన్‌రెడ్డి డీన్ చంద్ర కిషోర్ రెడ్డి తెలిపారు. ఎంపిసి మొదటి సంవత్సరం ఫలితాల్లో శ్రావణ్ -466, భానుచంద్ర 466,వాత్సల్య 466,సాయి గణేష్ 465,ఆర్.సహానా 465,ఆర్ దీపక్ - 465,టి.చక్రనేశ్వర్ 475, సి.జాహ్నవి 465,వి.రోహిత 465, మార్కులు సాధించారని పేర్కొన్నారు. బైపిసిలో యాసీన్ 435, పరమేశ్వర్ 434, లాస్య 434, లోచన 434, హేమప్రియ 434, రామ లక్ష్మి 434 మార్కులు సాధించాలని చెప్పారు. విద్యార్థులను డీన్ సుబ్బారావు, వెంకట రెడ్డి, ఎజీమ్ చెన్నాకృష్ణారెడ్డి, ప్రతాపరెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపల్ మురళీమోహన్, వెంకటస్వామి, సుధాకర్ రెడ్డి, సౌజన్య, రాఘవరెడ్డి, సుమన్ అభినందించారు.

పులివెందుల టౌన్ : పట్టణంలోని తపస్య జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం విడుదలైన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి విజయ కేతనం ఎగురవేశారని కరస్పాండెంట్ ఎ.చంద్ర ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు కె.ఉత్రేక్ష 460, భవ్యశ్రీ 448, యోగ మునీంద్ర రెడ్డి 415, జి.తారక నరసింహారెడ్డి 412, స్నేహలతరెడ్డి 411, ఎం.వెంకట సుదర్శన్ 410, గంగా లలిత 406, ఎం.గంగా కార్తీక్ 406, కె.దివ్యశ్రీ 402, తేజ శ్రీసాయి 402, ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థులు వి.జోష్న 983, జె.శ్వేత 950, డి తహసీన్ 945, ఎన్.మహాలక్ష్మి 929, సాయి విఘ్నేష్‌రెడ్డి 918, జాస్మిత 916 అత్యధిక మార్కులు సాధించి కళాశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చిన విద్యార్థులను ప్రిన్సిపల్ బి.రవిశంకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సీవీ సుదర్శన్‌రెడ్డి అభినందించారు.

ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ఇంటర్మీడియట్ ఫలితాలలో శ్రీ విద్యా కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారని కళాశాల డైరెక్టర్లు శ్రీకాంత్ కుమార్‌రెడ్డి, రామ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ ఎంపీసీలో గణేష్, ముని చందన 466, రంగ హర్షవర్ధన్, సుమయా సుల్తానా 465, జూనియర్ బైపీసీ విభాగంలో పవన్‌కుమార్ 431, మైథిలిరెడ్డి 430, జాహ్నవిరెడ్డి 436, సీనియర్ ఎంపిసి విభాగంలో గీతాంజలి 991, తేజశ్విని 990, నస్రీన్ 988, ముష్కాన్, లిఖిత, నవల్ 987, సాహితీ, సనా, నాగ గాయత్రి 985, సీనియర్ బైపీసీ విభాగంలో సబ్రిన్, రహమతున్నీసా, మూయిజ్ 981, సాధించారని వివరించారు. ఈ సందర్భంగా వారు అధ్యాపక సిబ్బందితో కలిసి విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న శ్రీ విద్య అధ్యాపకులు

కేబుల్ వైర్లు అపహరణ

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ 23వ లింగలదిన్నె వార్డు పరిధిలోని గొల్లపల్లె గ్రామంలో శుక్రవారం రాత్రి బోర్లకు సంబంధించిన స్టాటర్ వైర్లు అధికంగా అపహరించారు. బాధితులు అందించిన వివరాల ప్రకారం.. రాత్రి సమయంలో స్టార్టర్ వద్ద కేబుల్‌ను కట్ చేసి ఎత్తుకు పోయారన్నారు. దాదాపు 15 మంది రైతులకు సంబంధించి బోర్ల వద్ద వైర్లు కత్తిరించుకు పోయినట్లు తెలిపారు. గతంలో కూడా పలుమార్లు ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని వాపోయారు. పంటలు చేతికి అంది వచ్చే సమయంలో వైర్లు అపహరించడంతో చాలా వరకు నష్టం వాటిళ్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా వరుస దొంగతనాలు జరుగుతున్నప్పటికీ ఆ ముఠాను పట్టుకోలేకపోతున్నారన్నారు. రాత్రి సమయాల్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత వైర్లను కత్తిరిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నా పోలీసులు గట్టి చర్యలు చేపట్టడం లేదని రైతులు పేర్కొంటున్నారు. దొంగల ముఠాను కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

పేదల స్థలాలను కొట్టేస్తున్నారు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రోడ్డు విస్తరణలో పేదల స్థలాలను కొట్టేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఓ ధృతరాష్ట్రుడు.. ఆయన కుమారుడు కొండారెడ్డి ఓ దుర్యోధనుడులా అవతారమెత్తారని విమర్శించారు. ముందుగా ఆయన మైదుకూరు రోడ్డు విస్తరణలో భాగంగా జరుగుతున్న పనులను శనివారం మాజీ ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు మైదుకూరు రోడ్డు విస్తరించే కార్యక్రమం చేపట్టామన్నారు. అప్పుడు రెండు కిలోమీటర్ల మేర విస్తరణ చేశామన్నారు. ఏ చిన్న వ్యాపారికి కూడా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వహించామన్నారు. నేడు ఈ విస్తరణలో భాగంగా పేదల స్థలాలను కొట్టివేస్తున్నారని, అధికార పార్టీ వ్యక్తుల స్థలాల జోలికి పోవడం లేదన్నారు. ఇందుకు డబ్బులే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్నారు. కొత్తపల్లి పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డికి చెందిన డీసిఎస్ఆర్ ఎదురుగా ఉన్న 18 రూముల జోలికి పోకుండా కాల్వను అడ్డదిడ్డంగా తీసుకెళ్తున్నారన్నారు. సావిత్రమ్మ అను పేద మహిళలకు చెందిన అర్థ సెంటు స్థలంలోని చిన్న రూమును పడగొట్టారన్నారు. ఇది పట్టా స్థలమని ఆమె చెబుతున్నా అరణ్య రోదన గానే మిగిలిపోయిందన్నారు. ఆధారాలు చూపుతున్న ప్రయోజనం లేదన్నారు. నిమ్మకాయల సుధాకర్ రెడ్డి వ్యవహారం అందరికీ తెలిసిందే అన్నారు. మైదుకూరు రోడ్డు విస్తరణలో పేదలకు అన్యాయం జరిగితే సహించనని, ఆందోళన కార్యక్రమాలు చేపడతానని రాచమల్లు పేర్కొన్నారు. కాలువ పరిశీలనలో మున్సిపల్ చైర్పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, బంగారు రెడ్డి, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆరాధన పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారి మఠంలో శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన ఉత్సవాల సందర్భంగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మం గారి ఆరాధన మతప రంగా గొప్ప ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. ఆవిష్కరణ అనంతరం బ్రహ్మంగారిమఠం పిట్ పర్సన్ శంకర్ బాలాజీ ఎమ్మెల్యేను అధికారికంగా ఆరాధన కార్యక్రమానికి ఆహ్వానించారు. మండల కేంద్రంలో కల్యాణమండపం, పోలేరమ్మ గుడి వద్ద చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతి కుమారుడు వెంకటాద్రి స్వామి, టిడిపి మండల నాయకులు పూజ శివ యాదవ్, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్